క్లుప్తంగా

బీఎస్ఎఫ్ జవాన్‌కు సన్మానం



విజయకుమార్‌ను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న బీఎస్ఎఫ్ జవాన్ విజయకుమార్‌ను స్థానిక పద్మశాలి సంఘం ప్రతినిధులు సన్మానించారు. కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన విజయకుమార్ బీఎస్ఎఫ్‌లో పనిచేస్తూ ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్నాడు. ఇటీవల సెలవుపై స్వగ్రామానికి రాగా.. ఆదివారం స్థానిక ఎస్ఐ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సంఘం భవనంలో అతడిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు మద్దెల రమేశ్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యం, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



తండావాసులకు విరాళం అందజేస్తున్న మైనంపల్లి హన్మంతరావు

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని తండాలో సేవాలాల్ ఆలయ నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఈమేరకు మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన తండావాసులకు నగదు అందజేశారు. పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు నాగరాజు, సరాపు యాదగిరి, దేమె యాదగిరి, పట్టణ కార్యదర్శి వెంకటేశ్, దోమకొండ యాదగిరి, నాగులు, విప్లవ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పోలీసులు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు తీసుకోకుండా రాత్రి సమయంలో హల్దీవాగు నుంచి ఇతర మండలాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మండలంలోని ఆరెగూడెం గ్రామ శివారులో శనివారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. స్థానిక అవసరాలకు కాకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గణిత ఫోరం మండల కమిటీ ఎన్నిక



చిన్నశంకరంపేట మండల సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ప్రభుత్వ గణిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గణిత ఫోరం మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నశంకరంపేట జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు శివనాగరాజు, ప్రధాన కార్యదర్శిగా మడూర్ జడ్పీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ప్రమోద్ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మాధవి, కార్యదర్శులుగా నరేందర్, రాజేష్, వినయ్ కుమార్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా పోచయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గాంధీ విగ్రహావిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని మాడాపూర్‌లో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. గతంలో ఉన్న విగ్రహం ధ్వంసం కావడంతో ఆ స్థానంలో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఇంజిన్ చోరీ

నర్సాపూర్: ట్రాక్టర్ ఇంజిన్ చోరీకి గురైన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం కథనం ప్రకారం... పట్టణానికి చెందిన అశోక్ ట్రాక్టర్‌ను రోజు మాదిరిగా శనివారం రాత్రి కూడా మార్కెట్‌యార్డు వద్ద పార్కు చేశాడు. కాగా ఆదివారం ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్ ఇంజిన్ కనపడలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా?



మండల పరిధిలోని బొగుడ భూపతిపూర్- శాలిపేట గ్రామం మధ్యలో ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై కేజీవీల్స్ తిప్పడం వల్లే పాడవుతుందని స్థానికులు వాపోతున్నారు. గుంతల రోడ్డుపై రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని కేజీవీల్స్ తిప్పకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

– హవేళిఘణాపూర్(మెదక్)

● కూలిన వృక్షం.. రాకపోకలకు ఇబ్బందులు



వందల ఏళ్ల నాటి భారీ వృక్షం నేల కూలింది. అల్లాదుర్గం నుంచి కాయిదంపల్లి వెళ్లే రహదారిపై భారీ మర్రి వృక్షాలు ఉన్నాయి. ఇదే రోడ్డుపై రైతులు ధాన్యం ఆరబోసి బస్తాల వద్ద కాపలా ఉన్నారు. ఇంతలో పెద్ద శబ్దంతో భారీ మర్రి చెట్టు కూలింది. దీంతో రైతులు అక్కడి నుంచి పరుగులు తీశారు. తృటిలో పెను ప్రమాదం తప్పింది. చెట్టు విరిగి ఒక రోజు గడిచినా ఎవరూ తొలగించడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లే వీలు లేక 161 రహదారి సర్వీస్ రోడ్డు వైపు నుంచి వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

– అల్లాదుర్గం(మెదక్)

ప్రతిష్ఠ మహోత్సవానికి వేళాయె..

- ఈ నెల 3 నుంచి 5 వరకు పూజా కార్యక్రమాలు
- శ్రీ గురుపీఠంలో ఏర్పాట్లు పూర్తి



గురుపీఠంలో నిర్మించిన ఆలయాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో నిర్మించిన శ్రీ గురుపీఠంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామానికి చెందిన హై కోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ సంకల్పంతో శ్రీ గురుపీఠం నిర్మాణం చేపట్టారు. ఇందులో దత్తాత్రేయ, సాయిబాబా ఆలయాలు నిర్మించారు. ఈ నెల 3 నుంచి 5 వరకు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురుపీఠంను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రానున్న కాలంలో శివ్వంపేట ఆధ్యాత్మిక కేంద్రంగా మారనుంది. రెండేళ్ల క్రితం శివ్వంపేటలో నిర్మించిన బగలాముఖి శక్తిపీఠంతో పాటు ప్రస్తుతం గూడూర్‌లోని గురుపీఠంతో ఇక్కడి ప్రాంత రూపు రేఖలు మారిపోనున్నాయి.

భక్తిమార్గంలో నడవాలి

సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో వెళ్లాల్సిన అవసరం ఉంది. పుట్టి పెరిగిన ఊరిని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశాం. రానున్న కాలంలో భక్తి, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

– శివకుమార్‌గౌడ్, శ్రీ గురుపీఠం చైర్మన్

ఘనంగా దుర్గమ్మ, సేవాలాల్ ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని టొర్య తండాలో దుర్గమ్మ, సేవాలాల్ మహరాజ్ ఉత్సవాలు ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తండావాసులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని దుర్గమాత, సేవాలాల్ మహరాజ్‌ని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, సీనియర్ నాయకులు కృష్ణారావు, యాదగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంత్ రెడ్డి, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నర్సాపూర్: నర్సాపూర్, హత్నూర మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు వీరేందర్, కిష్టారెడ్డి, వెంకటేశం, ప్రసాద్, అనిల్, శ్రీశైలగౌడ్ ఉన్నారు.

జీలుగ విత్తనాల కోసం రైతుల పాట్లు



కౌడిపల్లి ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం వద్ద జీలుగ విత్తనాల కోసం నిలుచున్న రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): జీలుగ విత్తనాలు రావడంతో రైతులు ఒక్కసారిగా అగ్రోస్ రైతు సేవా కేంద్రానికి చేరుకున్నారు. ఆదివారం మండలంలోని రైతుసేవ కేంద్రానికి 198 బస్తాల జీలుగ విత్తనాలు వచ్చాయి. వ్యవసాయ కార్యాలయంలో ఏఓ స్వప్న, రైతువేదిక వద్ద ఏఈఓ సాహితీ అందుబాటులో ఉండి రైతులకు టోకెన్లు ఇచ్చి పంపిణీ చేశారు. 30 కిలోల బస్తాకు రూ. 1237 చెల్లించి రైతులు జీలుగ విత్తనాలు తీసుకెళ్లారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీలకంఠులు రాజకీయంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిరాజ్యం

పెద్ద శంకరంపేట (మెదక్): నీలకంఠ సమాజ సభ్యులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ అఖిల భారత నీలకంఠ సమాజ సంఘం అధ్యక్షుడు లోక లక్ష్మిరాజ్యం పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని నీలకంఠ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీలకంఠ సమాజం జనగణన చేపట్టాలన్నారు. హైదరాబాదులో నీలకంఠ సమాజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నరసింహులు, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి శ్రీనివాస్, మండల నీలకంఠ సమాజం అధ్యక్షుడు నీలకంఠ విఠల్, మహిళా అధ్యక్షురాలు అరుణ, సభ్యులు శశాంకం, రామచందర్, రాజు, పోశెట్టి, రాజేందర్, శివరాణి, జ్యోష్ణ పాల్గొన్నారు.

తాగునీటి వృథా..

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని మటన్ మార్కెట్ వద్ద ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు ఓవర్ ఫ్లో కారణంగా తాగునీరు రోడ్డు పాలవుతోంది. కొన్ని రోజులుగా తాగునీరు మటన్ మార్కెట్ నుంచి శ్రీ సాయి థియేటర్ వరకు రోడ్డుపై పారుతూ వృథా అవుతోంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న తాగునీరు

3 నుంచి భూ భారతి గ్రామ సభలు

రేగోడ్(మెదక్): రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల వద్దకే అధికారులు వస్తారని స్థానిక తహసీల్దార్ దత్తారెడ్డి తెలిపారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఈనెల 3నుంచి 20వ తేదీ వరకు భూ భారతి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న చౌదర్‌పల్లి, బురాన్‌వాడి తండా, 4న తాటిపల్లి, దోసపల్లి, 5న జగిర్యాల, కొండాపూర్, 6న రేగోడ్, 9న టి.లింగంపల్లి, 10న వెంకటాపూర్, 11న మర్పల్లి, 12న పోచారం, 13న ప్యారారం, 16న కొత్వాన్‌పల్లి, 17న ఆర్.ఇటిక్యాల, 18న సిందోల్, 19న తిమ్మాపూర్, 20న గజ్వాడ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పెద్దశంకరంపేట మండలంలో..

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 3 నుంచి మండలంలో భూ భారతి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 3నుంచి కొప్పోల్, కొత్తపేట గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో చేగుంట శ్రీలక్ష్మి డెంటల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ రమేశ్ దంత సమస్యలు ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మన్ శ్రీనివాస్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తనాలే విత్తాలి

కంచన్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు



కౌడిపల్లి: పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కౌడిపల్లి(నర్సాపూర్): అధిక దిగుబడినిచ్చే విత్తనాలను విత్తుకోవాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని కంచన్‌పల్లిలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వానాకాలం పంటలసాగు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ చిన్న బాబునాయక్, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త డాక్టర్ జేసుదాసు, కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తీసుకోవాలని , పంటకోతకు వచ్చేవరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని రైతులకు సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులలో భాగంగా వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటల సాగులో యంత్రాలు, డ్రోన్‌లను వినియోగించి కూలీల కొరతను అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ స్వప్న, ఏఈఓ సాహితి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

మాసాయిపేట మండలంలో...

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని అచ్చంపేట గ్రామంలో ఆదివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు ఆధునిక వ్యవసాయ పద్ధతుల వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. వరి పంటలో అధిక దిగుబడినిచ్చే రకాలను సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డా.ఉదయ్ కుమార్, డా. ప్రసన్న హోలజ్జర్, ఎన్‌బీపీజీఆర్ శాస్త్రవేత్త డా.అప్పారావు, మాసాయిపేట ఏటీఎం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో...

ఘనంగా బోనాల ఊరేగింపు



రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద బోనాల ఊరేగింపు

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మహిళలు సామూహిక బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఉదయం ఆలయ ఫౌండర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ ఆధ్వర్యంలో గణపతి, దేవత పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిరణ్ గౌడ్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు



కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో ..



వెల్దుర్తి(తూప్రాన్): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

కౌడిపల్లి(నర్సాపూర్): చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1999–2000 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి గురువులు మోహన్‌రెడ్డి, కే.రాములు, టీఎస్ ప్రభాకర్, పుండరీకంగౌడ్, నీరజ, పెంటయ్యలను సన్మానించారు.

వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణంలో ఆదివారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు ఒక్కచోట చేరి అప్పటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



నర్సాపూర్ రూరల్: రెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

రెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2000 సంవత్సరం బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉత్సవాలకు రావాలని ఆహ్వానం

చేగుంట(తూప్రాన్): మండలంలోని పెద్దశివనూర్‌లో జరిగే విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు రావాలని మాజీ వైస్ ఎంపీపీ రాంచంద్రం, ఉత్సవ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో ఎంపీ రఘునందన్‌రావును ఆదివారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. గ్రామంలో జరిగే ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలకు రావాలని కోరారు.

◆ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నర్సాపూర్ రూరల్: మండలంలోని పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన రాజ్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి బాసటగా చిన్ననాటి స్నేహితులు, శ్రేయోభిలాషులు తమవంతుగా ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. మాజీ సర్పంచ్ శివకుమార్, మల్లేష్ గౌడ్, అంజయ్య, స్నేహితులు ఉన్నారు.

◆ వృద్ధులకు దుస్తులు పంపిణీ

నర్సాపూర్: తన భార్య యాదమ్మ స్మారకార్థం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వ్యాపారి యాదాగౌడ్ తెలిపారు. ఆమె ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనతోపాటు కుమారులు బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ గౌడ్ విజన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, భోజనం, పండ్లు అందచేశారు.

◆ నల్లపోచమ్మ ఆలయంలో పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం దేవాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేష్, విఘ్నేష్ అమ్మవారికి అభిషేకం చేశారు.